ఉపేక్షిస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకం !

- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- చర్లపల్లిలో పారిశ్రామికవాడలో ఆందోళనకరంగా నీరు
- పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేస్తామన్న బాధితులు

కుషాయిగూడ: పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా పేరు గాంచిన చర్లపల్లి పారిశ్రామికవాడలో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. పారిశ్రామికవాడలో వెలిసిన కొన్ని కెమికల్స్ కంపెనీల మూలంగా పారిశ్రామికవాడ మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు నెలకొనే ప్రమాదం లేకపోలేదు. భూగర్భ జలాల కలుషిత సమస్య తీవ్రరూపం దాల్చకముందే ముందస్తు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో నీటి కష్టాలు తప్పవన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

◆ చర్లపల్లి, బీఎన్‌రెడ్డినగర్ కాలనీలో కెమికల్స్ కంపెనీలు వదిలే వ్యర్థ రసాయానాలతో భూగర్భజలాలు కలుషితమై విషపూరిత నీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా పారిశ్రామికవాడలోని ఫేజ్-2లో ఓ పారిశ్రామికవేత్త తన సొంత ప్లాట్‌లో బోరు వేయగా విషపూరితమైన నీరు బయటకు వచ్చింది.

◆ బోరు నుంచి వచ్చిన నీటిలో వస్తున్న నురుగు, వ్యర్థ రసాయానాలు, ఘాటైన కెమికల్స్ వాసనతో అక్కడ నిలబడలేని పరిస్థితులు ఏర్పడటం పారిశ్రామికవేత్తలను ఆందోళనకు గురిచేస్తుంది.



బోరు నుంచి వచ్చిన కెమికల్స్‌తో రంగు మారిన దృశ్యం

◆ కొన్ని కెమికల్స్ కంపెనీల కారణంగా పారిశ్రామికవాడలోని వందల కంపెనీల మనుగడకు ప్రమాదం కలిగే అవకాశం కనిపిస్తున్న నేపథ్యంలో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్న కెమికల్ కంపెనీలపై తగిన చర్యలు తీసుకుని పారిశ్రామికవాడను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



బోరు నీటి నుంచి వచ్చిన వ్యర్థ రసాయనాలు

పూర్తిగా విషపూరితం..



మాది బీఎన్‌రెడ్డినగర్. ఇటీవల కాలనీలోని నా సొంత ప్లాట్‌లో బోరు వేశాను. బోరు నుంచి దుర్గంధభరితమైన నీరు బయటకు వచ్చింది. ఘాటైన కెమికల్స్ వాసన, నురుగుతో కూడిన విషపూరితమైన నీరు రావడం ఆందోళన కలిగించింది. కెమికల్ కంపెనీల కారణంగానే మా కాలనీలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమాయ్యాయి. వ్యర్థ రసాయనాలు వదులుతున్న కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలి.

– రాజు, బీఎన్‌రెడ్డినగర్

చర్యలు తప్పవు..



చర్లపల్లి పారిశ్రామికవాడకే ముప్పువాటిల్లేలా కెమికల్ కంపెనీల తీరును ఉపేక్షించేది లేదు. బీఎన్‌రెడ్డినగర్‌తో పాటు పారిశ్రామికవాడలోని అన్ని ఫేజ్‌లకు ఈ పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. స్వతహాగా నేను కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాను. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతాం.

– రోషిరెడ్డి, ఐలా చైర్మన్

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుషాయిగూడ : దోమల వ్యాప్తితో ప్రబలే విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. కాప్రా ఎంటమాలజీ సిబ్బంది శనివారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో డెంగీ, మలేరియా విష జ్వరాల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వ్యక్తిగత శుభ్రతతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని దోమలవ్యాప్తిని అరికట్టాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఎంటమాలజీ సిబ్బంది సలహాలను పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో పారేసిన కొబ్బరి బోండాలు, డబ్బాల వంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద మురుగు ఇలా..

మల్కాజిగిరి: మల్కాజిగిరి చౌరస్తాలో డ్రైనేజీ నిండి రోడ్డుపై పారుతున్న జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా డ్రైనేజీ నిండి పారుతుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ జీహెచ్‌ఎంసీ నిర్వహించినప్పుడే బాగుండేదని జలమండలి నిర్వహణ చేపట్టిన తర్వాత ఎటు చూసినా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని స్థానికులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లో రూ.75 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులు, కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ సీనియర్ నేత శాగ రవీందర్ పాల్గొన్నారు.



వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఘనంగా వనమహోత్సవం

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కమలానగర్ కాలనీ ఎంకేబీఆర్ పార్కు స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ సుభాష్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, డీఎస్.నాయక్, కిషోర్, హేమంత్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వార్డు ఆఫీసర్ గోవింద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : శ్రీ చైతన్య స్కూల్‌లో గ్రీన్ ఇండియాలో భాగంగా శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా స్కూల్ ఏజీఎం మహ్మద్ అలీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు పచ్చని బాట వేయాలని సూచించారు. డీన్ నాగరాజు, పుల్లారావు, రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, కనకయ్య, అరుణ్ తదితరులున్నారు.



కమలానగర్ కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సుభాష్‌నాయక్

వినతిపత్రం అందజేత

కుషాయిగూడ: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలని వారిని కోరారు. టీయూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్, ఇందర్‌కుమార్, భాస్కర్, తాడూరి గగన్ కుమార్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, శ్యామల, యాదగిరిరెడ్డి, నరేందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, కొండా స్వామి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

నేడు బోనాల తేదీపై సమావేశం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బోనాల వేడుకల నిర్వహణ తేదీ ఖరారుపై చర్చించేందుకు వీరాంజనేయ స్వామి దేవాలయం మేడిపల్లిలో ఆదివారం ఉదయం 11.00 గంటలకు నగర పాలకవర్గం, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, కాలనీల సంక్షేమ సంఘాలు, దేవాలయాల నిర్వాహకులు, ప్రజాపతినిధులు హాజరై తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఓ ప్రకటలో కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ మల్లిఖర్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నేడు ఆదివారం షెనాయ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 01.30 వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ కార్పొరేటర్ రాఘవన్‌కు పితృవియోగం



గౌతంనగర్: అమీర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ రాఘవన్ (వెంకటరమణ) తండ్రి ఆదినారాయణ (82) మృతి చెందారు. గౌతంనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం తెల్లవారు జామున 4.30కి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గతంలో నిజామాబాద్ జిల్లా ట్రైబల్ డిపార్టుమెంట్‌లో డీడీగా పనిచేసి 2007లో పదవీవిరమణ పొందారు. ఆదినారాయణ పార్థివదేహానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు, గౌతంనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

స్థానిక సమస్యలపై ఎంపీ ఈటలకు వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌తో కార్పొరేటర్ సునీతాయాదవ్

మౌలాలి: ఎంపీ ఈటల రాజేందర్‌ను మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్ కాలనీలో పర్యటించాలని ఎంపీని ఆమె కోరారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ వివరించారు. ఆదివారం దీన్‌దయాల్‌నగర్‌లో ఎంపీ పర్యటిస్తారని అనంతరం బీజేపీ నేతలతో ఆత్మీయ సత్కారంలో పాల్గొంటారని సమాచారం. సాయిబాబా, లింగారావు, శివగౌడ్, వెంకటేష్ నేత, ప్రసాద్ చౌదరి, వేణు, రాము, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేసిన కల్నల్ దీప్ జ్యోతిసైకా

బోడుప్పల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, అంకిత భావంతో మెలగాలని కల్నల్ దీప్ జ్యోతి సైకా అన్నారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాల దశ నుంచి విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో వివిధ హోదాలను నిర్వహించినందుకు కల్నల్ చేతుల మీదుగా యోగ్యతా అధికారాలను స్వీకరించారు. విద్యార్థుల స్వాగతాంజలి, శాస్త్రీయ నాట్యం అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల వ్యవస్థాపకులు రితేష్, ప్రిన్సిపాల్ కస్తూరిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై తగిన చర్యలు



రోడ్డును పరిశీలిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు

బోడుప్పల్: ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీమాధవి, సూర్యనాయక్ అన్నారు. బోడుప్పల్ 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనితయాదగిరి బోడుప్పల్ నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో రాజీవ్‌నగర్ కమాన్, దేవేందర్‌నగర్ కాలనీ ఫేస్-2 వెళ్లే మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఉప్పల్ ట్రాఫిక్ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ట్రాఫిక్ సీఐలు సదరు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు యాదగిరి, దుర్గయ్య పాల్గొన్నారు.

అభినందన



కుషాయిగూడ: రాచకొండ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌బాబును శనివారం సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నాగేశ్వర్‌రెడ్డి, సురేందర్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, అంజిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్ పోస్టర్ ఆవిష్కరణ

అల్వాల్: దీర్ఘకాలిక పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి 15న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. శనివారం అల్వాల్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను కొన్నేళ్లుగా పట్టించుకోవడం లేదన్నారు. 15న జిల్లా కలెక్టర్లకు మెమోరాండం సమర్పించాలని, 30న ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల మహా మౌనదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.

భయాందోళనలో బఫర్ జోన్ నివాసితులు

- ఉప్పల్ మండల పరిధిలో మూసీ బఫర్ జోన్‌లో 1589 ఇళ్ల గుర్తింపు
- రామంతాపూర్ మూసీ నుంచి 50 మీటర్ల బఫర్ జోన్‌లో కొనసాగుతున్న సర్వే



రామంతాపూర్ మూసీ బఫర్ జోన్‌లో సర్వే చేస్తున్న ప్రభుత్వ అధికారులు (ఫైల్)

రామంతాపూర్ : నగర పరిధిలో దాదాపు 55 కిలో మీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిలో కాలుష్య నియంత్రణతో పాటు పరిసర ప్రాంతాలను సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం మూసీ బఫర్ జోన్ స్థలాల్లో సర్వే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రామంతాపూర్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణ ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు మూసీనదికి ఇరువైపులా అంటే ఇటు పక్కా రామంతాపూర్ అటు పక్క నాగోల్, కొత్తపేట్‌లలో మూసీ నది నుంచి 50 మీటర్ల లోపు ఉన్న బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను పరిశీలిస్తూ.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎండీఏ, రెవెన్యూ జలమండలి అధికారులు గత 15 రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. దీంతో రామంతాపూర్ బఫర్ జోన్‌లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారు తమ సొంతిళ్లు పోతాయని భయంతో ఆందోళన చెందుతున్నారు. ఈ బఫర్ జోన్‌లో ఉన్న ప్రార్థనా మందిరాలు, వ్యాపారాలు నిర్వహిస్తున్న స్థలాలను కూడా పరిశీలిస్తున్నారు.

◆ ఉప్పల్ మండల పరిధిలో రామంతాపూర్ మూసీ పరివాహక బఫర్ జోన్‌తో పాటు నాగోల్ కొత్తపేట బఫర్ జోన్‌లలో ఇప్పటి వరకు అధికారులు 1589 నిర్మాణాలను గుర్తించినట్లు సమాచారం.

ప్రభుత్వమే ఆదుకోవాలని..

రామంతాపూర్ మూసీ పరివాహక స్థలాలు బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయని తెలియక చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజలు ప్రాంతంలో స్థలాలు కొని ఇళ్లను నిర్మించుకుని చాలా కాలంగా జీవిస్తున్నారు. ఇటీవల మూసీ సుందరీకరణకు బఫర్‌జోన్‌లో ఉన్న ఇళ్లను తొలగిస్తారని భయంతో ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. పేద ప్రజలే నివసిస్తున్న బఫర్‌జోన్ వాసులను ప్రభుత్వమే ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ రామంతాపూర్ మూసీ పరివాహక బఫర్‌జోన్‌లో ఇళ్లు, ఇతర నిర్మాణాలను కోల్పోతున్న వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇచ్చి నగదు పరిహారాన్ని ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రామంతాపూర్ భగాయత్‌ను అనుకొని ఉన్న మూసీ పరివాహక బఫర్ జోన్‌లో మూసీ నది సుందరీకరణకు ఇటీవల అధికారులు నిర్వహిస్తున్న సర్వేతో బఫర్ నివాసితుల్లో తమ నివాసాలు పోతాయనే భయాందోళనలు మొదలయ్యాయి. దీనిపై ప్రభుత్వం సానుకూల వైఖరితో తమకు న్యాయం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్ : నాచారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ, అవురా ఫీడర్, స్టాలిన్ టైర్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మల్లాపూర్, నాచారం మెయిన్ రోడ్డు, ఐడీఏ నాచారం, రోడ్ నెంబర్ 5,6,8 శాంతి బాయిలర్స్ అనాలాజిక్ లేన్‌లో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్తును నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ టెక్ పార్క్ ఫీడర్, బాలజీ ఫీడర్, ఏపీ ఫుడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్ నెంబర్ 12,15 ఐడీఏ నాచారం, ఏపీ ఫుడ్ రోడ్డు నెంబర్ 15 ఐలా కమిషనర్ కార్యాలయం నుంచి చిలుకానగర్ చౌరస్తా వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చెంగిచెర్లలో ఆగస్టు 4న బోనాలు



సమావేశంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

బోడుప్పల్: చెంగిచర్లలో ఆగస్టు 4వ తేదీన బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం పోచమ్మ దేవాలయంలో సమావేశమై వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్యయాదవ్, కో- ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, నేతలు కొత్త గోపాల్‌గౌడ్, ఏర్పుల మహేష్ తదితరులున్నారు.

బాలుడి అదృశ్యం



మధుసూధన్

మేడిపల్లి : బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే సంజీవ్‌కుమార్ రెండో కుమారుడు మధుసూదన్ (13) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వతరగతి చదువుతున్నాడు. కాగా ఈనెల 8న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బయటకు వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బాలుడి ఆచూకీ కోసం తెలిసిన వారివద్ద విచారించగా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు. గతంలోనూ అదృశ్యమై తిరిగొచ్చాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి ఎస్సై నర్సింగరావు తెలిపారు.

అయోధ్య రాముని శివ ధనస్సు ప్రదర్శన



శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో..

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం భక్తుల దర్శనార్థం అయోధ్య రాముడి శివధనస్సును ప్రదర్శించారు. ఈ సందర్భంగా అయోధ్య భాగ్యనగరం సీతారామ సేవా ఫౌండేషన్ చైర్మన్ చల్లా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ.. ఈ ధనస్సును అన్ని దేవాలయాల్లో భక్తుల దర్శనార్థం అనంతరం వచ్చే సంవత్సరం నాటికి అయోధ్యలో స్వామివారికి సమర్పిస్తామని తెలిపారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన

ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టిన బాధితులు



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న సొసైటీ సభ్యులు

కవాడిగూడ: కాప్రా మున్సిపాలిటీలోని వంపుగూడలోని కృష్ణానగర్‌లో కొనుగోలు చేసిన స్థలాలను మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, తన అనుచరుల నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాము 1983లో 706 మంది సభ్యులు కృష్ణానగర్‌లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేశామని, 2000లో ప్రేమ్‌సాగర్‌రావు కొంతమంది స్థల యజమానులను బెదిరించి 150 ప్లాట్లను కొనుగోలు చేశారని ఆరోపించారు. మిగతా 556 ప్లాట్లను తనకే అమ్మాలని బెదిరిస్తున్నారని వాపోయారు. శనివారం కాప్రా జీహెచ్‌ఎంసీ పరిధిలోని వంపుగూడలో ఉన్న సర్వే నెంబర్ 639/1, 643/1, 647/1, 648, 654 సర్వే నెంబర్లలో మొత్తం 706 ప్లాట్లను కొనుగోలు చేసిన కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.బి.రెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి ప్రకాష్, మీడియా ఇన్‌చార్జి కోటిరెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, పరశురాములు, సాల్మన్, రాంబాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మార్కెట్ ధరతో సంబంధం లేకుండా తాను చెప్పిన ధరకే మిగతా స్థలాలను అమ్మాలంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని వాపోయారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



సాంస్కృతిక వేషధారణలో చిన్నారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాట్య గురువు తేజస్విని, సంగీత గురువులు రజిని వాచస్పతి బృందం స్వర నృత్య విభావరి అలరించింది. త్రిశతి, శ్రీనిధి, అనన్య, స్నేహ, ప్రణతి, షణ్మిఖి, తన్విక, రిత్విక, శ్రీలేఖ్య, నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు.